మున్సిపల్ అభివృద్ధికి నిధులు మంజూరు చేస్తా

సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

- ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి

నర్సాపూర్, జూన్ 29: మున్సిపల్ అభివృద్ధికి కావాల్సిన నిధుల మంజూరుకు కృషి చేస్తానని ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి తెలిపారు. శనివారం నర్సాపూర్ మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ అశోక్‌గౌడ్ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశంలో మున్సిపాలిటీకి సంబంధించిన వివిధ అభివృద్ధి పనుల గురించి చర్చించి, వాటిని ఆమోదించి, తీర్మానించారు. పట్టణంలో గురుకుల పాఠశాల ఏర్పాటు, డబుల్ బెడ్‌రూమ్ ఇండ్లను అర్హులైన వారికి కేటాయించుట, మున్సిపాలిటీకి కేటాయించిన టీయూఎఫ్ఐడీసీ, ఎస్‌డీఎఫ్ నిధుల విడుదల చేయుంచేందుకు ఎమ్మెల్యేను పాలక మండలి సభ్యులు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిధుల మంజూరుకు కృషి చేస్తానన్నారు. నర్సాపూర్ మున్సిపల్ అభివృద్ధికి ప్రతిఒక్కరూ పాటు పడాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ నయీమొద్దిన్, కమిషనర్ జైత్‌రాంనాయక్, కౌన్సిలర్లు, మేనేజర్ మధుసూదన్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

జీరో బిల్ కోసం దరఖాస్తు చేసుకోవాలి



రామాయంపేట మండల కార్యాలయంలో జీరోబిల్ ఆన్‌లైన్ చేస్తున్న ఆపరేటర్

రామాయంపేట, జూన్ 29: విద్యుత్ జీరో బిల్ కాని వారికి ప్రభుత్వం మరో అవకాశం కల్పించింది. మూడు నెలల కాలంగా సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కోడ్‌తో జీరో బిల్‌ను ప్రభుత్వం నిలిపేసింది. మళ్లీ విద్యుత్ గృహ వినియోగదారుల కోసం రామాయంపేటలో నివసించే వారికి జీరో బిల్ దరఖాస్తులను ఎంపీడీవో కార్యాలయంలో మున్సిపల్ సిబ్బంది ఆన్‌లైన్ చేస్తున్నారు. రేషన్‌కార్డు, ఆధార్‌కార్డు, ప్రజాపాలన దరఖాస్తు, ఫోన్ నెంబర్, గ్యాస్‌బుక్ నెంబర్, విద్యుత్ బిల్, ఇంటి పన్ను జిరాక్సును అందజేయాలి. మండలవాసులు జీరో బిల్ కోసం వెంటనే ఆన్‌లైన్ చేసుకోవాలని విద్యుత్ ఏఈ పెంట్యానాయక్, ఎంపీడీవో షాజుల్లావుద్దీన్ తెలిపారు.

అంకిత భావంతోనే పని చేస్తేనే గుర్తింపు

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి

నర్సాపూర్, జూన్ 29: ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేస్తేనే గుర్తింపు వస్తుందని ఎమ్మెల్సీ రఘోత్తంరెడ్డి అన్నారు. శనివారం మండలంలోని అచ్చంపేట్‌లో గల ప్రాథమికోన్నత పాఠశాలలో హెచ్‌ఎం శ్రీనివాస్ ఉద్యోగ విరమణ పొందిన సందర్భంగా పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో వీడ్కోలు సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ పీఆర్‌టీయూ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల సమస్యలు సీఎం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించామన్నారు. కార్యక్రమంలో పీఆర్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కమలాకర్, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఎంఈవో బుచ్చానాయక్, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, ప్రధాన కార్యదర్శి సామ్యానాయక్ పాల్గొన్నారు.

మట్టి అక్రమ రవాణాను ఆపాలి

మల్లె చెరువు నుంచి మట్టిని ట్రాక్టర్ల ద్వారా తీసుకెళ్తున్న అక్రమార్కులు

రామాయంపేట, జూన్ 29: రామాయంపేటలోని మల్లె చెరువు నుంచి కొంతమంది అక్రమార్కులు రైతుల పేర్లు చెప్పుకుని దర్జాగా మట్టిని తరలిస్తున్నారని, అక్రమ రవాణాను ఆపాలని కాంగ్రెస్ నాయకులు అల్లాడి వెంకటి, చిలుక స్వామి, వినయ్ శనివారం వినతిపత్రం సమర్పిం చారు. మట్టి అక్రమ రవాణాపై రెండు రోజుల క్రితం మల్లె చెరువుకు వద్దకు వెళ్లి ఆపినట్లు వారు తెలిపారు. అయినా అక్రమార్కులు మట్టిని తరలించడం ఆపడం లేదన్నారు. కాంగ్రెస్ పార్టీకి చెందిన కొంతమంది వ్యక్తులు ఎమ్మెల్యే పేరు చెప్పుకుని మట్టి దందాకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రెవెన్యు అధికారులు ఈ మట్టి దందాపై ఉక్కుపాదం మోపాలని కోరారు. ఆర్డీవో, కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు.

రెవెన్యు అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

మురుగు నీటితో ఇబ్బందులు

నర్సాపూర్, జూన్ 29: మండలంలోని లింగాపూర్ గ్రామ ముఖద్వారం వద్ద రోడ్డుపై మురుగు నీరు నిలిచి స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీరు దుర్గంధం వెదజల్లడం, ఈగలు, దోమలు స్వైరవిహారం చేయడంతో స్థానికులు అనారోగ్యానికి గురవుతున్నారని, మురుగు నీటిని వెంటనే తొలిగించాలని గ్రామస్తులు అధికారులను కోరుతున్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

PLOT FOR SALE
★గజ్వేల్ టౌన్ మెయిన్ రోడ్, SBI దగ్గర 161 చ.గ. ఇంటి స్థలం అమ్మబడును. వివరాలకు సంప్ర: 8143366630 / 9989554915.
NT-325858

WANTED
★Corel Draw Photo Shop Designer M/F Sal: 20K, Office Clerk Female Calculation & Receptionist Sal: 15K, 2 No's Marketing Executives (Male) Sal: 18K. Near RTC X-Road, Pillar No. 34 & 35. 9849003504.
NT-97639-All

గమనిక: క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్/డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

ఫీజులను నియంత్రించాలి

రామాయంపేట, జూన్ 29: ప్రైవేట్ విద్యాసంస్థల ఫీజులు నియంత్రించాలని ఏబీవీపీ రాష్ట్ర వర్కింగ్ కమిటీ సభ్యులు శశికాంత్, ప్రశాంత్ డిమాండ్ చేశారు. శనివారం రామాయంపేటలో దున్నపోతుకు వినతి పత్రం అందజేశారు. ప్రభుత్వానికి విద్యపై చిత్తశుద్ధి లేదన్నారు. డీఈవోకు ఎన్నోసార్లు సమస్యలపై విన్నవించినా పరిష్కరించడం లేదన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వ పాఠశాలల్లో కనీస సౌకర్యాలు కల్పించేలా ఆదేశించాలన్నారు

దున్నపోతుకు వినతిపత్రం అందజేస్తున్న ఏబీవీపీ నాయకులు

ప్రభుత్వ కళాశాలల్లోనే నాణ్యమైన విద్య

- గణాంకాలకు ప్రాధాన్యత ఇవ్వాలి
- కలెక్టర్ రాహుల్‌రాజ్

కళాశాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ రాహుల్ రాజ్

మెదక్, జూన్ 29 (నమస్తే తెలంగాణ): గణాంకాలకు ప్రాధాన్యత ఇవ్వాలని పీసీ మహలనా బీస్ జయంతి సందర్భంగా కలెక్టర్ రాహుల్ రాజ్ కోరారు. జాతీయ గణాంక దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్, అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు పాల్గొని నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ గణాంకాలకు ప్రాధాన్యత ఇవ్వాలని, జీఎస్‌డీపీని మండల, డివిజనల్, జిల్లా స్థాయిలో కూడా చేయాలన్నారు. ముఖ్య ప్రణాళిక అధికారి కార్యాలయంలో జరిగిన రివ్యూ మీటింగ్‌లో ముఖ్య ప్రణాళిక అధికారి బి.మాన్య నాయక్ మాట్లాడుతూ మండల ప్లానింగ్ అధికారులు, డివిజనల్ లెవెల్ స్టాటిస్టికల్ అధికారి క్రమ పద్ధతిలో పనిచేసి గణాంకాలకు ప్రాధాన్యత ఇచ్చేలా నివేదికలు నిర్దేశిత గడువు లోపల సమర్పించాలన్నారు. సమావేశంలో జిల్లా గణాంక అధికారి మాకం బద్రీనాథ్, ఉపగణాంకాధికారి సీహెచ్ సురేశ్, సహాయ గణాంకాధికారి జి.సురేశ్, మండల ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.

బ్రోచర్ విడుదల చేసిన కలెక్టర్

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 29: ప్రభుత్వ కళాశాలల్లో అర్హత, అనుభవజ్ఞులైన అధ్యాపకులు ఉంటారని, ప్రతి విద్యార్థి ఆ కళాశాలల్లోనే విద్యనభ్యసించాలని కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో మెదక్ డిగ్రీ కశాశాలలో ప్రవేశపెట్టిన కోర్సులకు సంబంధించిన బ్రోచర్‌ను ప్రిన్సిపాల్ హుస్సేన్, అధ్యాపకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ కళాశాలల్లో ఆధునిక వసతులతో కూడిన సౌకర్యాలను రాష్ట్ర ప్రభుత్వం కల్పిస్తున్నదన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో అధ్యాపకులు అంకితభావంతో పనిచేయాలని సూచించారు. అంతకుముందు ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కళాశాలలో ఈ ఏడాది నుంచి కామర్స్ విభాగంలో బీబీఏ కోర్సును ప్రవేశపెట్టినట్లు తెలిపారు. బీఏ, బీకాం, బీఎస్సీ కోర్సులన్నింటిలో కంప్యూటర్ సైన్స్ కోర్స్‌తో పాటు మూక్స్ ద్వారా కొన్ని ఆన్‌లైన్ కోర్సులు సైతం ఉన్నట్లు పేర్కొన్నారు. కోర్సులను విద్యార్థులు గమనించి ఎన్నుకోవాలని సూచించారు.

పట్టణ ప్రగతి నిధులు రావడం లేదు

- మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్
- ఇష్టారీతిన ఎజెండా రూపకల్పన
- మున్సిపల్ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్

మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌ల మధ్య వాదోపవాదాలు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 29: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కోసం ప్రతి నెలా పట్టణ ప్రగతి నిధులు వస్తుండేవని, ఆ నిధులు ఇప్పుడు రావడం లేదని మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ అన్నారు. శనివారం మెదక్ మున్సిపల్ సాధారణ సర్వసభ్య సమావేశాన్ని మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎజెండాలోని అంశాలను చర్చిస్తూ వైస్ చైర్మన్ మల్లికార్జున్‌గౌడ్ మాట్లాడారు. ఎజెండాను ఇష్టమైన రీతిలో తయారు చేయడం తగదన్నారు. అందులో పేర్కొన్న పనుల వివరాలు, ఏ నిధులతో ఏయే పనులు చేపడతారో ఎందుకు చేర్చడం లేదని మున్సిపల్ కమిషనర్ జానకీరామ్ సాగర్‌ను అడిగారు. ఎన్ని నిధులు వచ్చాయి, ఎంత ఖర్చు చేస్తున్నారో వివరాలు తెలుపాలని వైస్ చైర్మన్ ప్రశ్నించారు. గౌరవ స్థానంలో ఉండి ఇలా మాట్లాడటం సరికాదని చైర్మన్, వైస్ చైర్మన్‌ను ఉద్దేశించి అన్నారు. దీంతో సమస్యల పరిష్కారం కోసం మాట్లాడటం తప్పనుకుంటే గౌరవ సభ్యుల మధ్యలో కూర్చొని మాట్లాడుతానని, వేదిక దిగి గౌరవ సభ్యుల మధ్యలో వైస్ చైర్మన్ కూర్చున్నారు. 30వ వార్డులో తాగునీటి పైప్‌లైన్ కట్‌వాల్ చెడిపోయిందని ఎన్నిసార్లు చెప్పినా ఎవరూ పట్టించుకోవడం లేదని ఆయన మండిపడ్డారు. పట్టణంలోని జేఎన్‌రోడ్డు గుంతలమయమైందని, గుంతలు పూడ్చాలని కమిషనర్, ఇంజినీరింగ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. చెత్త వాహనానికి మరమ్మతులు చేపట్టకుండా ప్రైవేట్ వాహనం అద్దెకు తీసుకుని, మరమ్మతుకు రూ.2 లక్షలు అయ్యిందనడం సమంజసం కాదన్నారు. ప్రత్యేక పారిశుధ్య డ్రైవ్ పేరిట 50 మంది కూలీలను నియమించుకున్నట్లు ఎజెండాలో చేర్చారని, ఆ వివరాలు తెలియపర్చాలని డిమాండ్ చేశారు. గత ప్రభుత్వ హయాంలో అభివృద్ధి కోసం ప్రతి నెలా పట్టణ ప్రగతి నిధులు వస్తుండేవని, ఇప్పుడు ఆ నిధులు వస్తున్నాయా అని కౌన్సిలర్ ఆంజనేయులు చైర్మన్‌ను అడగగా, ప్రస్తుతం పట్టణ ప్రగతి నిధులు రావడం లేదన్నారు. పోస్టాఫీస్ క్వార్టర్స్ గేటును వెంటనే గేట్ తెరిపించాలని మహిళా కౌన్సిలర్లు కల్యాణి, జయశ్రీ చైర్మన్ దృష్టికి తీసుకురాగా, త్వరలో సమస్య పరిష్కరిస్తామన్నారు. జీకేఆర్ కాంప్లెక్స్ ఎదుట ప్రధాన రహదారి మధ్యలో భగీరథ పైపులైన్ మ్యానువల్ ధ్వంసమైందని, దీంతో రోడ్లు దెబ్బతింటున్నాయని కౌన్సిలర్ కృష్ణారెడ్డి తెలిపారు. ఔరంగబాద్‌లో తాగు నీరు రావడం లేదని కౌన్సిలర్ కిశోర్ సభ దృష్టికి తెచ్చారు. సమావేశంలో కౌన్సిలర్లు జయరాజ్, షమియొద్దిన్, శ్రీనివాస్, లింగం, విశ్వం, లలిత, సులోచన ప్రభావతి, అధికారులు పాల్గొన్నారు.

పరిమితి లేకుండా రైతు భరోసా ఇవ్వాలి

పాపన్నపేట, జూన్ 29: పరిమితి విధించకుండా రైతు భరోసా ఇవ్వాలని రైతులు డిమాండ్ చేశారు. శనివారం పాపన్నపేట మండలం చీకోడ్‌లో జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, సొసైటీ చైర్మన్ దత్తరాజు ఆధ్వర్యంలో రైతుభరోసాపై అభిప్రాయ సేకరణ నిర్వహించారు. రైతు భరోసా కింద పెట్టుబడి సాయాన్ని రైతులందరికీ ఇవ్వాలని కోరారు. కౌలు రైతులకూ ఇవ్వాలన్నారు. 10 ఎకరాల వరకు పరిమితి విధించి పెట్టుబడి సాయం అందించాలని కొంతమంది కోరారు. కార్యక్రమంలో మండల ఏవో నాగం కృష్ణ, సహకార సంఘం అల్లాదుర్గ్ కస్టర్ ఇన్‌చార్జ్ తదితరులు ఉన్నారు

రేగోడ్‌లో..

రేగోడ్, జూన్ 29: మండలంలోని పీఏసీఎస్‌లో రైతులతో సర్వసభ్య సమావేశాన్ని జిల్లా వ్యవసాయాధికారి గోవింద్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. రైతులనడిగి రైతు భరోసా అమలు గురించి అభిప్రాయాలు సేకరించారు. సహకార శాఖ ఏఆర్ ఫయాజొద్దిన్, ఏఈ జావిద్, పీఏసీఎస్ చైర్మన్ రాజు యాదవ్, వైస్ చైర్మన్ రాధాకిషన్, సీఈవో హఫీజ్ పాల్గొన్నారు.

మృతుడు అశోక్ కుటుంబాన్ని ఆదుకుంటాం

రామాయంపేట, జూన్ 29: మృతిచెందిన రైతు అశోక్ కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకుంటామని మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు అన్నారు. మండలంలోని లక్ష్మాపూర్ గ్రామానికి వెళ్లి హత్యకు గురైన రాగుల అశోక్ కుటుంబాన్ని శనివారం పరామర్శించారు. కాంగ్రెస్ కార్యకర్త హత్యకు గురికావడం బాధాకరమన్నారు. ఆయనతో పీసీసీ కార్యదర్శి చౌదరి సుప్రభాతరావు, ఎంపీటీసీ మల్లన్నగారి నాగులు, మాజీ సర్పంచ్ సిద్ధరాములు ఉన్నారు.

మైనంపల్లిని కలిసిన నాయకులు

చేగుంట, జూన్ 29: మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతురావును నార్సింగి ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు సత్యనారాయణ, చిన్నశంకరంపేట కాంగ్రెస్ నాయకులు జంగర్ల గోవర్ధన్, అంచనూరి రాజేశ్, బోయిని ప్రభాకర్, చందుయాదవ్, శంకర్ కలిశారు.

దివ్యాంగుల పింఛన్ రూ.6 వేలకు పెంచాలి

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 29: దివ్యాంగుల పింఛన్‌ను రూ.6వేలకు పెంచాలని దివ్యాంగుల హక్కుల జాతీయ వేదిక జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఆగమయ్య, జిల్లా అధ్యక్షురాలు యశోద, జిల్లా గౌరవ అధ్యక్షుడు బస్వారాజ్ శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఆసరా పింఛన్లు పెంచుతామని ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరారు. కేంద్రం ఇస్తున్న రూ.300లను రూ.3 వేలకు పెంచాలని డిమాండ్ చేస్తూ జూలై 3న కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

మండల అభివృద్ధికి కృషి చేయాలి: ఎంపీపీ

చేగుంట, జూన్ 29: మండల అభివృద్ధికి తనవంతు కృషి చేయాలని ఎంపీపీ మాసుల శ్రీనివాస్, డీపీవో యాదయ్యను కోరారు. చేగుంట ఎండీడీవో కార్యాలయాన్ని డీపీవో శనివారం సందర్శించారు. ఆయనను ఎంపీపీ, ఎంపీడీవో చెన్నారెడ్డి సన్మానించారు. కార్యక్రమంలో అసిస్టెంట్లు శ్రీశైలం, విజయ్, లింగం, శ్రీను, రాజుగౌడ్ న్నారు.

సేవా కార్యక్రమాలను విస్తరిస్తాం: రెడ్‌క్రాస్

రామాయంపేట, జూన్ 29: రాష్ట్ర వ్యాప్తంగా రెడ్‌క్రాస్ సొసైటీ సేవలు విస్తరిస్తామని రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సింగం శ్రీనివాస్‌రావు, రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. శనివారం రామాయంపేటలో జిల్లా మేనేజ్‌మెంట్ కమిటీతో సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. జిల్లావ్యాప్తంగా సేవా కార్యక్రమాలతో పాటు సభ్యత్వ నమోదు చేపడుతామన్నారు. మెదక్‌లో రెడ్‌క్రాస్ కార్యాలయం ఏర్పాటుకు కలెక్టరేట్‌లో ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. జిల్లా కోశాధికారి డీజీ శ్రీనివాస్‌శర్మ, కమిటీ సభ్యులు యాదగిరి, లక్ష్మణ్ యాదవ్, రమేశ్, కైలాస్, దామోదర్‌రావు, సత్యనారాయణ ఉన్నారు.

నర్సాపూర్, జూన్ 29: ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ మాజీ అధ్యక్షుడు, మాజీ మంత్రి డి.శ్రీనివాస్ పార్థివ దేహానికి కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్ శనివారం బంజారాహిల్స్‌లో నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్ పట్టివేత

వెల్దుర్తి, జూన్ 29: మండలంలోని మన్నెవారి జలాల్‌పూర్‌లో అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్సై నవత తెలిపారు. గ్రామానికి చెందిన బాలరాజు తన ట్రాక్టర్‌లో శివారులోని వాగులో నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్నాడు. ఈ సమాచారంతో పోలీసులు దాడి చేసి ఇసుక ట్రాక్టర్‌ను పట్టుకుని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ట్రాక్టర్ యజమాని, డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

అదుపుతప్పి డ్రైనేజీలో పడ్డ కారు

రామాయంపేట, జూన్ 29: అదుపు తప్పి మారుతీ కారు రోడ్డు పక్కనున్న డ్రైనేజీలో పడ్డ ఘటన రామాయంపేట మండలం రాయిలాపూర్ గ్రామ శివారులో శనివారం తెల్లవారుజామున జరిగింది. వివరాల్లోకి వెళితే.. మెదక్, ఎల్కతుర్తి రోడ్డు పనులు ఆరునెలలుగా నత్తనడకన కొనసాగుతున్నాయి. రామాయంపేట నుంచి సిద్దిపేట వరకూ రోడ్డు పనులు నడుస్తున్నాయి. కారు సిద్దిపేట నుంచి రామాయంపేటకు వస్తున్న క్రమంలో డ్రైనేజీ కనిపించక అందులోకి దూసుకెళ్లింది. కారులో ఉన్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు.

అనారోగ్యంతో మహిళా హోంగార్డు మృతి

వెల్దుర్తి, జూన్ 29: వెల్దుర్తి పోలీస్‌స్టేషన్‌లో మహిళా హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న వెల్దుర్తికి చెందిన బొడ్డుగారి లక్ష్మినర్సమ్మ(53) శుక్రవారం రాత్రి అనారోగ్యంతో మృతి చెందింది. ఈ విషయం తెలుసుకున్న తూప్రాన్ సీఐ కృష్ణ శనివారం మృతురాలి ఇంటికెళ్లి వారి కుటుంబసభ్యులను పరామర్శించి, అంత్యక్రియల కోసం ఆర్థిక సాయం అందజేశారు.

బైపాస్ రోడ్డు ప్రమాదంలో మరో వ్యక్తి మృతి

చేగుంట, జూన్ 29: చేగుంటలోని వడియారం బైపాస్ వద్ద శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మరో వ్యక్తి చికిత్స పొందుతూ, పరిస్థితి విషమించడంతో శనివారం మృతి చెందాడు. చేగుంట పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మధ్యప్రదేశ్‌లోని రేవా జిల్లా, చిక్వ గ్రామానికి చెందిన కూలీ రమేశ్ (రాజు) వడియారం బైపాస్‌లో రోడ్డు ప్రమాదానికి గురై, చికిత్స నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ, పరిస్థితి విషమించడంతో మృతి చెందాడు. మృతదేహానికి పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్సై బాల్‌రాజు తెలిపారు.

కల్యాణలక్ష్మి చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్

విద్యుత్, తాగునీటి సరఫరాలో
ఇబ్బందులు తలెత్తొద్దు

- మెదక్ ఎమ్మెల్య మైనంపల్లి రోహిత్
- కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ

చిన్నశంకరంపేట, జూన్ 29: విద్యుత్, తాగునీటి సరఫరాలో ఇబ్బందులు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ ఆదేశించారు. శనివారం చిన్నశంకరంపేటలోని ఎంపీడీవో కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అధికారులు ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. రెండేళ్లలో మండలంలోని అన్ని రోడ్లు పూర్తి చేస్తామన్నారు. అనంతరం మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 29 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు పంపిణీచేశారు. పదవీ విరమణ చేయనున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలను ఘనంగా సన్మానించారు.

ఆగస్టు15లోపు రెండు లక్షల రుణమాఫీ

ఆగస్టు 15లోపు రైతులకు కాంగ్రెస్ ప్రభుత్వం రెండు లక్షల రుణమాఫీ చేస్తుందని మెదక్ ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్ తెలిపారు. శనివారం చిన్నశంకరంపేటలో రూ.55 లక్షల నిధులతో నిర్మించిన సహకార సంఘ భవనాన్ని డీసీసీబీ చైర్మన్ దేవేందర్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతుల సంక్షేమం కోసం కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. మహిళా సంఘాల సైతం రుణాలనూ అందిస్తున్నట్లు డీసీసీబీ చైర్మన్ తెలిపారు. చిన్నశంకరంపేట సొసైటీకి ఫర్నిచర్ కొనుగోలు కోసం రూ.3 లక్షలు ఇస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీపీ ఆవుల భాగ్యలక్ష్మీ, వైస్ ఎంపీపీ సత్యానారాయణ గౌడ్, ఎంపీడీవో దామోదర్, ఏడీఏ విజయ నిర్మల, ఏజీఎం నరసింహారెడ్డి, సింగిల్ విండో చైర్మన్ అంజిరెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, సత్యనారాయణ, మాజీ సర్పంచ్‌లు శ్రీమాన్‌రెడ్డి, రాజిరెడ్డి, తహశీల్దార్ మన్నన్ ఏఈవో లక్ష్మీ ప్రవీణ్ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ సాయి సింధు, డిప్యూటి తహశీల్దార్ మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

అతిథి అధ్యాపకులకు దరఖాస్తుల ఆహ్వానం

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 29: మెదక్, నర్సాపూర్, రామాయంపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలల్లో అతిథి అధ్యాపకుల పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ హుస్సేన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మెదక్ కళాశాలలో తెలుగు 1, ఇంగ్లిష్ 1, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్‌కు 4 పోస్టులు, నర్సాపూర్‌లో తెలుగు 1, ఇంగ్లిష్ 1, ఎకనామిక్స్ 1, హిస్టరీ 1, పొలిటికల్ సైన్స్ 1, కామర్స్ 2, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ 1, ఫిజిక్స్ 1, జువాలజీ 1 పోస్టులు, రామాయంపేటలో తెలుగు 1, ఎకనామిక్స్ 1, హిస్టరీ 1, పొలిటికల్ సైన్స్ 1, కామర్స్ 1, కెమిస్ట్రీ 1, కంప్యూటర్ సైన్స్ అండ్ అప్లికేషన్స్ 1, బాటనీ 1, జువాలజీ 1 పోస్టులకు దరఖాస్తులు కోరుతున్నట్లు పేర్కొన్నారు. ఈ పోస్టులకు సంబంధిత సబ్జెక్టుల్లో పోస్టు గ్రాడ్యుయేషన్‌లో 55 శాతం మార్కులతో ఉతీర్ణులై ఉండాలన్నారు. పీహెచ్‌డీ, నెట్, సెట్ అర్హత కలిగిన అభ్యర్థులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వబడుతుందని తెలిపారు. ఆసక్తి, అనుభవం కలిగిన అభ్యర్థులు జూలై 2వ తేదీలోగా మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. 3న అన్ని డిగ్రీ కళాశాలల పోస్టులకు ఇంటర్వ్యూలు మెదక్ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

నాణ్యమైన విద్యాబోధన అందించాలి: డీఈవో

చిన్నశంకరంపేట, జూన్ 29: విద్యార్థులకు నాణ్యమైన బోధన అందించాలని డీఈవో రాధాకిషన్ సూచించారు. శనివారం చిన్నశంకరంపేట జడ్పీ పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించారు. విద్యార్థులకు చదవడం, రాయడం వంటి అంశాలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. రోజూ పాఠశాలకు పంపేలా తల్లిదండ్రులను ప్రోత్సహించాలన్నారు. శాలిపేట పాఠశాలకు ఇద్దరి ఉపాధ్యాయులను కేటాయించామన్నారు. దీప్లానాయక్, ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య, నాగరాజు ఉన్నారు.

పాతకక్షలతోనే రైతు అశోక్ హత్య

నిందితులను సమావేశంలో ప్రవేశపెట్టిన పోలీసులు

రామాయంపేట, జూన్ 29: పాతకక్షలతో పథకం ప్రకారమే రైతు రాగుల అశోక్‌ను హత్య చేశారని సీఐ వెంకటరాజాగౌడ్ అన్నారు. శనివారం రామాయంపేట పోలీస్ స్టేషన్‌లో నిందితులను విలేకరుల ఎదుట ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ మండలంలోని లక్ష్మాపూర్ గ్రామానికి చెందిన మృతుడు రాగుల అశోక్‌తో పదేండ్లుగా గెట్టు పంచాయితీ వివాదం కొనసాగుతున్నది. గ్రామ పెద్ద మనుషులు పలుమార్లు పంచాయితీ పెట్టి నచ్చజెప్పినా ఇరువురు వినకుండా కక్షలు పెంచుకున్నారు. రెండు రోజుల క్రితం అదే గ్రామానికి చెందిన చేపూరి రమేశ్ అతని భార్య వెంకటలక్ష్మి, కుమారులు భరత్, వినయ్ తమ పొలం వద్ద కాపుకాసి మృతుడు పొలం వద్దకు రావడం చూసి కర్రలతో ఒక్కసారిగా దాడి చేశారు. మృతుడి తలపై బండరాయితో మోది హత్యచేశారు. దాడికి పాల్పడ్డ నలుగురిపై కేసు నమోదు చేసి రిమాండ్ చేసినట్లు ఎస్సై రంజిత్ తెలిపారు.

కోర్టు భవనాలను పరిశీలించిన జడ్జి

కోర్టు ఏర్పాటుకు పాత హాస్టల్ భవనాన్ని పరిశీలిస్తున్న జిల్లా జడ్జి లక్ష్మీశారద

తూప్రాన్, జూన్ 29: తూప్రాన్‌లో డివిజన్ కోర్టు ఏర్పాటుకు తాత్కాలిక వసతి కోసం పట్టణంలోని పలు భవనాలను జిల్లా జడ్జి లక్ష్మీ శారద శనివారం పరిశీలించారు. శనివారం పాత బాలుర వసతి గృహం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్‌ను పరిశీలించారు. ఆమె వెంట తూప్రాన్ ఆర్డీవో జయచంద్రారెడ్డి, డీఎస్పీ వెంకట్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ జ్యోతి, వైస్ చైర్మన్ నందాల శ్రీనివాస్ ఉన్నారు.

సబ్ జైల్‌ను తనిఖీ చేసిన జిల్లా సివిల్ జడ్జి

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 29: రాష్ట్ర న్యాయ సేవ అధికార సంస్థ, జిల్లా ప్రధాన న్యాయమూర్తి లక్ష్మీశారద ఆదేశాల మేరకు మెదక్ సీనియర్ సివిల్ జడ్జి జితేందర్ శనివారం మెదక్ సబ్ జైల్‌ను తనిఖీ చేశారు. ఖైదీల ఆరోగ్యం గురించి అడిగి తెలుసుకున్నారు. వంటశాలను తనిఖీ చేశారు. అనంతరం ఖైదీలకు జైలు అదాలత్, ఫ్రీ బార్గెనింగ్ చట్టాలపై అవగాహన కల్పించారు. ఆయన వెంట సూపరింటెండెంట్ శ్రీనివాస్ ఉన్నారు.

సింగరేణి ప్రైవేటీకరణ ఆపాలి

నిరసన వ్యక్తం చేస్తున్న సీపీఎం నాయకులు

మెదక్ మున్సిపాలిటీ, జూన్ 29: సింగరేణి ప్రైవేటీకరణను ఆపాలని కోరుతూ సీపీఎం ఆధ్వర్యంలో మెదక్‌లోని పోస్టాఫీస్ చౌరస్తాలో శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం మాట్లాడుతూ మూడోసారి అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం దేశంలోని ప్రభు త్వ రంగసంస్థలన్నింటినీ అదానీ, అంబానీ లాంటి కార్పొరేట్ శక్తులకు అప్పజెప్తున్నారన్నారు. బొగ్గు గనుల ప్రైవేటీకరణ ఆపకపోతే దేశవ్యాప్తంగా పోరాటాలు చేస్తామన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు బస్వరాజు, నాయకులు ఆజయ్, సత్యం, ఫరీద్ పాల్గొన్నారు.